క్లుప్తంగా

పంగిడిగూడెంలో ఆర్‌సీఎం చర్చ్ ప్రారంభం



నూతన చర్చ్‌లో ప్రార్థనలు చేస్తున్న బిషప్ జయరావు పొలిమేర, ఫాదర్‌లు

ద్వారకాతిరుమల: దేవాలయం అనేది మంచిని తెలియజేస్తూ, మనల్ని సన్మార్గంలో నడిపించేందుకు ఏర్పాటు చేసిన ఒక కట్టడమని ఏలూరు బిషప్ జయరావు పొలిమేర అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో నూతనంగా నిర్మించిన తిరుహృదయ ఆర్‌సీఎం చర్చ్ ప్రారంభోత్సవ వేడుక శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయరావు పొలిమేర ముందుగా చర్చ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నూతన దేవాలయానికి విచారణ కర్తగా ఉన్న ఫాదర్ టోనీని, దేవాలయ నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సంఘస్తులు బిషప్ జయరావు పొలిమేరను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విన్సెన్షియేషన్ సుపీరియర్ ఫాదర్ పాల్ పుదువ, రీజనల్ సుపీరియర్ ఫాదర్ జోబీ, 40 మంది గురువులు, దాదాపు 400 మంది భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

టైలర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



పుష్ప సంధ్యకు డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఆంజనేయరాజు

కొయ్యలగూడెం: కన్నాపురం లేడీస్ టైలర్ దిర్శిపోం రవీంద్ర కుటుంబానికి ఇప్పటివరకు రూ.1,35,519 ఆర్థిక సహాయం లభించిందని టైలర్స్ అసోసియేషన్ నాయకులు తాడిగడప ఆంజనేయరాజు శనివారం విలేకరులకు తెలిపారు. రవీంద్ర అతని భార్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నేపథ్యంలో భార్య మృతి చెందగా రవీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్ చేతుల మీదుగా సుమారు రూ.93 వేల ఆర్థిక సహాయం కూడా ఇటీవల అందజేసినట్లు తెలిపారు. అదనంగా మరో సుమారు రూ.43 వేలు టైలర్స్ అసోసియేషన్ సభ్యులు విరాళంగా అందించారన్నారు. ఇందులో రూ.లక్ష రవీంద్ర కుమార్తె పుష్ప సంధ్య పేరున డిపాజిట్ చేసినట్లు చెప్పారు. మిగిలిన సొమ్ము రవీంద్ర చికిత్సకు, కుటుంబ అవసరాల నిమిత్తం అందించామన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర టైలర్స్ పెద్దలు, నాయకులు, టైలర్ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలిథిన్ నిరోధానికి చర్యలు



పట్టుకున్న ప్లాస్టిక్ సంచులు, గ్లాసులను తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు క్లీన్ చింతలపూడిలో భాగంగా పట్టణంలోని షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు శనివారం తెలిపారు. తనిఖీల్లో 53 కేజీల 100 గ్రాముల ప్లాస్టిక్ సంచులు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారం పట్టుకున్న ప్లాస్టిక్ సంచులు, గ్లాసులను తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచనల మేరకు ధ్వంసం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలోని వ్యాపారులు పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్న పాలిథిన్ సంచులు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని విరమించుకోవాలని ఆదేశించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిమ్మాపురంలో చోరీ



పాపారావు ఇంట్లో తెరచి ఉన్న బీరువా తలుపులు

ద్వారకాతిరుమల: ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుమారు 4 కాసుల బంగారు వస్తువులను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సుధీర్ శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం. మండలంలోని తిమ్మాపురానికి చెందిన శంకాబత్తుల పాపారావు వివాహ వేడుక నిమిత్తం కుటుంబ సమేతంగా శుక్రవారం మధ్యాహ్నం విశాఖపట్నం వెళ్లారు. తిరిగి శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి, చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. తలుపులు ఎంత నెట్టినా తెరుచుకోలేదు. దాంతో వెనుక గుమ్మం వద్దకు వెళ్లి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. అలాగే ముందు గుమ్మం తలుపులు లోపలిపక్క గడియ పెట్టి ఉన్నాయి. బీరువా తలుపులు సైతం తెరచి ఉండటంతో ఇంట్లో దొంగలు పడినట్టు పాపారావు గుర్తించారు. సుమారు 4 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

మెట్ట ప్రాంతంలో కోతలకు సిద్ధం



మెట్ట ప్రాంతంలో వరికోత యంత్రంతో కోతలు కోయిస్తున్న దృశ్యం

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం సబ్‌డివిజన్ పరిధిలో 36,343 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 19,259 ఎకరాలు, లింగపాలెం మండలంలో 7,707 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 4,550 ఎకరాలు, టి నరసాపురం మండలంలో 4,827 ఎకరాలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సుమారు 5,500 ఎకరాల్లో వరినాట్లు వేయలేదు. సకాలంలో వర్షాలు కురవక పోవడం, చెరువుల్లో కూడా ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడంతో వేసిన వరిపంట చాలా చోట్ల ఎండిపోయింది. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో వరి పంట కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. సబ్ డివిజన్ పరిధిలో 30,958 ఎకరాల్లో 77,500 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. కొన్ని గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో వరికోత యంత్రాలపై రైతులు ఆధారపడుతున్నారు. వరి కోత మిషన్ అయితే గంటకు రూ.2 వేలు నుంచి రూ.2,500 వరకు చెల్లించి కోతలు కోయిస్తున్నారు. కూలీలతో అయితే కోతలు కోసి ధాన్యం ఆరాక కుప్పలు వేసి నూర్పిళ్లు చేపట్టేవారు. యంత్రాలతో అయితే ఒకేసారి కోతతో పాటు ధాన్యం నూర్చడం కూడా పూర్తవుతుండటంతో యంత్రాల కోసం రైతులు ఎగబడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వరికోత యంత్రాల యజమానులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించండి



రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి. సబ్‌డివిజన్‌లో 39 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించి అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– బి.నాగకుమార్, వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్

నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ లబ్ధి



జంగారెడ్డిగూడెం రూరల్: చక్రదేవరపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన హరిబాబు



జంగారెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జంగారెడ్డిగూడెం రూరల్: నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను హరిబాబు ఆవిష్కరించగా, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఆవిష్కరించారు. పార్టీ నేతలు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు తేడాను గమనించి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు దండు ధనరాజు, గురజాల పార్థసారథి, రవి రాజు, గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఇంటికి చేరువ చేశారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గూడపాటి రాధాకృష్ణ అన్నారు. పట్టణంలో 5వ సచివాలయ పరిధిలోని 13వ వార్డులో పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం, పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలు ఎంతవరకు జరిగింది అని ప్రజలను ఆరా తీయగా లబ్ధిదారులు జగనన్న పాలనలో తమకు అన్ని పథకాలు అందాయని హర్షం వ్యక్తం తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఈ సందర్భంగా పార్టీ నేతలు కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, 13వ వార్డు కౌన్సిలర్ పీపీఎస్ చంద్రబాబు, ఎల్‌వీఆర్ కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, అయినాల వెంకటరమణమూర్తి, చింతలపూడి ఏఎంసీ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవి, సచివాలయ కన్వీనర్ శాబోలు రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, పెద్దాడ, శ్రీను, కంచుమర్తి ప్రకాష్, మానికుల బ్రహ్మానందం, పంది రాజా, కంచర్ల విష్ణు, మేకా సుబ్రహ్మణ్యం, పెసరగంటి త్రిమూర్తులు, రాజబోయిన శ్రీను, దొప్పసాని రమేష్, బిక్కు పరమాత్మ, మానికల సత్తిబాబు, సంజు రంగారావు, పాకనాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి



చింతలపూడి: న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు



జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మపాలెంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్

చింతలపూడి: భారత రాజ్యాంగానికి అనుగుణంగా, వరకట్నానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. శనివారం లా డే, వరకట్న దినోత్సవం సందర్భంగా ఐసీడీసీ కార్యాలయంలో అంగన్‌వాడీలకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లాడే విశిష్టత, వరకట్నంపై మహిళలకు అవగాహన కలిగించారు. గ్రామాల్లో కుటుంబ సమస్యలు ఉంటే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే న్యాయ సేవల కమిటీ ద్వారా సహాయం అందిస్తామన్నారు. భర్తల ద్వారా, వారి బంధువుల ద్వారా ఇబ్బందులు పడుతున్న మహిళలు కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చునని అన్నారు. మహిళలకు గర్భస్థ, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం నేరమని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, న్యాయవాదులు డేవిడ్ రాజు, ఉమర్ ఫరూఖ్, మౌనిక, ఏసుపాదం, హెచ్ వేణు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, ఐసీడీపీఓ లీలా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలెం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్: నిజమైన రాజ్యాంగ ఫలాలు ఈ దేశం పొందాలంటే అమ్మపాలెం లాంటి ఆదర్శ గ్రామాలుగా ప్రతి గ్రామం మారాలని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం, వరకట్నం వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అమ్మపాలెం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామం కట్టుబాట్లను న్యాయమూర్తులకు వివరించారు. త్వరలో జిల్లాల్లో నేర రహిత గ్రామంగా అమ్మపాలెం మారడానికి తమ వంతు కృషి చేస్తామని న్యాయమూర్తులు తెలిపారు. ఈ కార్యక్రమం లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత శ్రీనివాసరావు, బార్ సెక్రెటరీ ఏవీవీ భువనేశ్వరి, లక్కవరం ఎస్సై దుర్గామహేశ్వరరావు, న్యాయవాదులు మాదేపల్లి క్రాంతి కుమార్, బల్లే సాయికుమారి, బందారు లతాకుమారి, దగ్గు కృష్ణ, పి.పెద్దిరాజు, తోట పద్మిని, అమ్మపాలెం గ్రామ సర్పంచ్ సురవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

30న మెగా జాబ్‌మేళా

బుట్టాయగూడెం: ఈ నెల 30వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం విలేకరులకు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకూ చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బుట్టాయగూడెం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంస్కరణలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించాలని కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన

కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం కళ్ళచెరువు, పోలాసగూడెం గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కే.శ్రీదేవి మాట్లాడుతూ దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రాంతాలకు అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

భక్తులతో కళకళలాడిన పట్టిసం శివక్షేత్రం



విశేషాలంకరణలో పట్టిసీమ వీరేశ్వరస్వామి



పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మద్ది క్షేతంలో స్వామి వారి దర్శనం క్యూలైన్‌లో భక్తులు

పోలవరం రూరల్: అఖండ గోదావరి నదీ మధ్య పోలవరం మండలం పట్టిసీమ శివక్షేత్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారికి కార్తీక మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామిని, క్షేత్ర పాలకుడైన భవన్నారాయణ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు దేవస్థానం ఈవో ఎస్ సంగమేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లా మురముళ్ల ప్రాంతం నుంచి 200 మంది విద్యార్థులు ఈ క్షేత్రాన్ని శనివారం దర్శించుకున్నారు. భక్తులతో పట్టిసం క్షేత్రం కళకళలాడింది.

భక్తులతో కిటకిటలాడిన మద్ది

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం రూరల్: పోలవరం మండలం బోడిగూడెం గ్రామంలో స్వయంభువుగా శ్రీగిరి పర్వతంపై వెలసిన శ్రీ పద్మావతీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారికి అర్చకులు తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పుష్పాలంకరణ, కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు నిర్వాహకులు బూరుగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

పారిజాతగిరిలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తీకమాస రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని కార్యనిర్వాహణాధికారి మానికల రాంబాబు తెలిపారు. శనివారం ఆలయంలో సుప్రభాత సేవ, ఆరాధన, తోమాల సేవ, భాలభోగం నివేదన, తీర్థప్రసాదగోష్ఠి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. శనిత్రయోదశి సందర్భంగా ఉదయం నుంచి మాలధారణ భక్తులు చేసిన గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. భీమవరం, పెనుగొండ, తాడేపల్లిగూడెం, తణుకు నుంచి భక్తులు భారీగా కాలినడకన స్వామిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదవితరణ చేసిన దాతలు కేతిరెడ్డి అప్పలనాయుడు, జే బాలరాజు, ఆర్ సుబ్బారావు, మార్బుల్ శ్రీను, కుమార్‌షర్ట్స్ శ్రీనులను ఆలయ అర్చకులు సన్మానించారు.

విద్యతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కల్చర్ ఫెస్ట్ అన్ డోనర్స్ డే సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌లకు సంబంధించిన టీవీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, సర్పంచ్ సిరపరపు ప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్ మాదేపల్లి సాయి, కొత్తపట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు అడ్డగర్ల సాయిబాబా, వైఎస్సార్ సీపీ నాయకులు మైగాపుల దుర్గా ప్రసాద్, పాడెం శ్యాంకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ నూతన ఆలయ పునర్నిర్మాణం

కొయ్యలగూడెం: స్థానిక శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 29వ తేదీన బాలాలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాలుగవ తేదీన ప్రస్తుతం ఉన్న అమ్మవారి మూల విరాట్ విగ్రహాన్నీ బాలాలయంలో ప్రతిష్ఠిస్తామని, డిసెంబర్ 14న నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజలు ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి శివానంద శర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించనున్నామని, భక్తులు విరాళాలు అందజేయాల్సిందిగా కోరారు. 1981లో ఆలయాన్ని నిర్మించగా ఇప్పటికే 42 ఏళ్లు పూర్తయింది.

ముగిసిన శ్రీసత్యసాయి జయంతి మహోత్సవాలు

కొయ్యలగూడెం: భగవాన్ శ్రీసత్యసాయి 98వ జయంతి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాలు ఈనెల 23న ప్రారంభించగా సత్యసాయి జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ప్రశాంతి పతాకావిష్కరణ, అనంతరం పీఠాన్ని పుష్పమాలంకరణతో భక్తులు తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సత్యసాయి పల్లకీ సేవ, అన్నసమారాధన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు నగర సంకీర్తన చేశారు.

నూకాలమ్మ సన్నిధిలో...



ఎంపీ శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసం సందర్భంగా పట్టణ ఇలవేల్పు దేవత శ్రీ చక్ర సహిత శ్రీనూకాలమ్మ అమ్మవారికి ఆలయంలో శనివారం నిత్య పూజాకైంకర్యాలు, సాయంసంధ్యాహారతి పూజలు, ఆకాశ దీపం పూజలు నిర్వహించారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఎంపీ శ్రీధర్‌కి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి, ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

వృత్తి విద్యా నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): మండలంలోని బర్రింకలపాడు ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యంపై శనివారం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.పెద్దరాజు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు వృత్తి విద్యపై నైపుణ్యం కలిగి ఉండటం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. పాఠశాల వృత్తి విద్యాబోధకుడు జీ బాబు విద్యార్థులతో కలిసి మండలంలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌ను సందర్శించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి వివరించారు.

ట్రాక్టర్ బోల్తా

ద్వారకాతిరుమల: రోడ్డుపై అడ్డొచ్చిన ఆవులను తప్పించబోయి ఒక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని జి.కొత్తపల్లిలో జీడిగింజల ఫ్యాక్టరీ వద్ద శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఘంటా దుర్గాంజనేయులుకు చెందిన ట్రాక్టర్ సీహెచ్ పోతేపల్లికి వెళుతోంది. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆవులు అడ్డురావడంతో వాటిని తప్పించే క్రమంలో డ్రైవర్ ట్రాక్టర్‌ను పక్కకు తిప్పాడు. దాంతో అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ ఇంజిన్, ట్రక్కు ఒక్కసారిగా బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.